# అన్యథా చింతితం కార్యం

"జోర్ సెయి !"

చక్రం తిప్పుతూ ఎల్లయ్య హుషా రందిస్తున్నాడు.

"హైలెసా."

కూలీలందరూ ఝామ్మని అందుకుంటున్నారు.

"బార్ సెయ్ !"

"హైలెసా."

"ఎత్తరా !"

"హైలెసా !"

ఇనుప గొలుసులు ఖణ్ ఖణ్ మంటూ లేస్తున్నాయి.

ఉన్నట్టుండి "ఓ (వో వో వో)" అన్న గోలా, ఆ గోలను చీల్చుకొంటూ ఇనుపదూలాన్ని పైకి లాగుతున్న క్రేన్ పెడుతున్న రొదా విని, కళ్ళు చికిలించి చూశాడు ముకుందం. నుదుటిమీది చెమటను తుడుచుకొన్నాడు. కళ్ళ జోడు తీసి, అద్దాలమీది దుమ్మును 'ఉఫ్'మని ఊది, తుడిచి,

ఆదరాబాదరాగా ముఖానికి తగిలించుకొని, పైకి లేస్తున్న ఇనుపదూలాన్ని చూశాడు. దూలానికి ఆ చివరా ఈ చివరా ఉన్న పొడవైనమోకుల్ని పట్టుకొని,దూలాన్ని సిమెంటు స్తంభాలమీదికి సరైన పొజిషన్‌లోకి మలుపుతున్నారు కూలీలు.

ముకుందం సైగ చేశాడు. క్రేన్ చక్రాలు రొద పెడుతూ తిరుగుతున్నాయి. భూతహస్తంలాంటి ఇనుప దూలం మెల్ల మెల్లగా పైకి లేస్తున్నది. మరో రెండు నిమిషాలు చాలు – అప్పటికి ఆ దూలం కాస్తా రెండు సిమెంటు స్తంభాలమీదికి చల్లగా వాలిపోతుంది. ఆ పనికాస్తా అయిపోతే, ఓ ముఖ్యమైన ఘట్టం ముగిసి నట్లవుతుంది!

పైకి లేచి పొజిషన్ వెదుక్కుంటూ, కిందికి దిగుతున్న ఇనుపదూలంకేసి ఆత్రంగా చూస్తున్నాడు ముకుందం. అతని చేతులు వణుకుతున్నాయి. పాదాలు తిన్నగా ఉండలేక తచ్చాట ముచ్చటలాడుతున్నాయి. అంతలోనే "ఛళుక్" మన్న మెరుపూ, ఆ వెంటనే "ఖణేల్" మన్న చప్పుడుతో బాటుగా క్రేన్, తాగిన వాడిలాగ ఊగిసలాడిపోయింది. పెద్ద చప్పుడుతో ఇనుపదూలం సిమెంటు స్తంభాలమీది నుంచి జారి పడిపోయింది.

ముకుందం కళ్లు బయర్లు కమ్మాయి.

"ఓ (హో హో హో)" అన్న గగ్గోలు మాత్రం అతనికి లీలగా వినిపించింది. తను కుప్పకూలిపోయిన సంగతికూడా అతనికి తెలీదు.

"దెబ్బలేమన్న తగిల్నెయ్యంటరా, బాబూ!"

తనమీదికి వంగి అడుగుతున్నాడు ఎల్లయ్య.

ముకుందం అటూ ఇటూ మసిలాడు. కళ్లు తెరుద్దామంటే రెప్పలు బరువెక్కిపోయి, తెరిపిళ్ళు పడడంలేదు. ఓపికనంతా కూడదీసుకొని మడత మంచంమీద కూచున్నాడు. ఎల్లయ్య తెచ్చిన చన్నీళ్లు ముఖంమీద చల్లుకొన్నాడు. బలవంతాన కళ్లు తెరిచాడు. కూలీలందరూ అల్లంత దూరంలో గుంపుగా నిలబడి తనకేసే చూస్తున్నారు.

తనేదో తప్పుచేసినట్లుగా గిల గిలలాడి పోయాడు ముకుందం. ఏటవాలుగా పడిపోయిన దూలంవేపూ, దూరంగా గుంపు కట్టిన కూలీలవేపూ చూసి నిట్టూర్చాడు ముకుందం.

"ఎవ్వరికీ దెబ్బలు తగల్లేదు గదా!" అన్నాడు ముకుందం.

"లే" దన్నాడు ఎల్లయ్య.

"ఈ పూటకు పనాపుచెయ్యండి. రేపు చూసుకొందాం!"

ఎల్లయ్య వెళ్ళిపోయాడు.

ముకుందం తల వంచుకొని ఓ క్షణకాలం ఆలోచించాడు. నెమ్మదిగా లేచాడు. కాళ్లు, చేతులు విదిలించుకొన్నాడు. టోపీమీది దుమ్మును చేత్తో దులుపుకొని నెత్తికి తగిలించుకొన్నాడు. వంతెనవైపుగా బయల్దేరాడు.

అప్పటికింకా ఓ బారెడు పొద్దున్నది. తుమ్మల చాటున దాక్కొన్న సూర్యుడు ఆకాశాన్నంతా ఎర్ర బుక్కాతో నింపేశాడు. దూరంగా ఉన్న కొండల నీడలు రొప్పుకొంటూ మైదానంమీదికి జరజరా పాకుతున్నాయి. గడ్డి బీళ్ళలోనించి గిజిగాళ్ళ పాటలు గగ్గోలుగా వినిపిస్తు న్నాయి. ఆ గోలమీదనించి తేలిపోతూ, అప్పుడప్పుడు బొణుగు చప్పుడు వినిపిస్తూంది.

మట్టికుప్పల్నీ, నరుకుడు రాళ్ళనూ తప్పుకొంటూ ముకుందం, పడిపోయిన ఇనుపదూలం దగ్గిరికి వచ్చాడు. సిమెంటు స్తంభంకూడా ఒక మూల విరిగిపోయింది. ఇనుప దూలం ఒక చివర భూమిలోకి దిగబడిపోయింది. రెండో చివర మొదటి స్తంభాన్నానుకొని నిలబడి వున్నది. దాన్ని తాకి చూశాడు ముకుందం. అటూ యిటూ కదిపాడు. చూపుడువేలితో మోగించాడు. "ఖణ్ ఖణ్" మని జవా బిచ్చిం దది. ఆ జవాబులో, 'నీకు నేను లొంగను సుమా!' అన్న ధ్వనిని పసిగట్టాడు ముకుందం.

"ఇప్పటికి రెండుసార్లు నాకు నువ్వెదురు తిరిగావ్!" అని మెల్లగా గొణిగాడు ముకుందం. ఇనుప దూలాన్ని చేతితో నిమురుతూ, "కనీసం రేపన్నా నేను చెప్పినట్లు విను —" అన్నాడు.

గోతుల్ని దూకలేక చుట్టు తిరిగివచ్చి, గట్టెక్కి కంకర రాళ్ళ కుప్పమీద కూచున్నాడు ముకుందం. సూర్యుడు

పూర్తిగా తుమ్మల్లో మునిగిపోయాడు. కొంపలవెనక ఎర్రని కాంతితో వెలిగే ఆకాశం, ముందు వేపున క్రమ క్రమంగా చిక్కబడుతున్న చీకటి—

ముకుందం వరసగా ఉన్న సిమెంటు స్తంభాలను సగర్వంగా చూశాడు. తను పడిన శ్రమకు ఇవి ఫలితాలు. ఈ చోటును ఎన్నుకోవడంలోనే తను చాలా తెలివిగా ప్రవర్తించాననాన్నాడు చీఫ్ ఇంజనీర్. ఈ వంతెన పనంతా తన చేతుల మీదుగానే పూర్తికావాలన్నాడు. ఆయనగారన్నారని కాదుగానీ తనుకూడా అక్షరాలా అంతే అనుకొన్నాడు. ఆ మాటకి వస్తే అసలింతకాలమూ ఈ ప్రాజెక్టు ఆగిపోవడమే అన్యాయం. దీనిమూలంగా ఎంత శ్రమ, ఎంత కాలం కలిసి వస్తుందో, ఇది పూర్తి అయ్యాకగానీ తెలియదు. సంవత్సరంలో ఏ కొద్ది కాలమోతప్ప, ఇక్కడ దాటడం సాధ్యం కాదు. అటూ యిటూ మట్టిరోడ్లున్న మాట నిజమే! కానీ ఏం లాభం? ఇది పూర్తయినప్పుడు, అరవై మైళ్ళదూరం చుట్టు తిరిగే బెడద తప్పుతుంది. పది పదిహేను గ్రామాల వాళ్ళకు టౌన్‌తో దగ్గిర సంబంధాలేర్పడుతాయి. సగం ఈ అభిప్రాయంతోనే తనిందుకు ఒప్పుకున్నాడు.

ఒప్పుకొన్నందుకు తన మాటకూడా దక్కింది. పన్నెండడుగులు తవ్వేసరికి చట్టు కనిపించింది. కంట్రాక్టరు "యిక చాలు బాబో" అని గోలపెడుతున్నా తను వినిపించుకోలేదు. షెడ్యూల్‌లో ఉన్న ప్రకారం పునాదులు తియ్యవలిసిందేనన్నాడు. అతగాడెన్నో ప్రలోభాలు తనకు చూపించాడు.

తను లొంగలేదు. లొంగదలుచుకోలేదు కూడా. ప్రజ లిచ్చిన పన్నులమీద తను జీవిస్తున్నాడు. కక్కుర్తిపడి ఆ ప్రజల డబ్బును దుర్వ్యయం చేసే హక్కు తనకు లేదు.

అదృష్టవశాత్తూ అన్నీ బాగా కుదిరాయి. స్తంభాల మీదికి దూలాలు ఎత్తడందగ్గిరే తఖరారు వచ్చిపడింది. తను రెండుసార్లు ప్రయత్నించినా, స్తంభాలమీద ఇనుపదూలం నిలపడంలేదు. లెక్కల్లో పొరబాటు లేదు. స్తంభాలను కట్టడంలో యెలాంటి లోపమూ లేదు. అన్నీ ఆచి, తూచి, ఆల్ రైట్ అనుకొన్న తరవాతనే ఇందుకు పూనుకొన్నాడు. అయితేమాత్ర మేం? పని సాగిందికాదు మరి!

దీనికి ఎల్లయ్య చెబుతున్న కారణం వేరు. అప్పుడెప్పుడో ఈ ప్రాంతంలో ఒక గ్రామం వుండేదిట. ఆ ఊళ్లో కోనలమ్మ అనే మహాఇల్లా లుండేదిట. ఆమెను అత్తగారూ, ఆడబిడ్డలూ చిత్రహింసలు పెట్టేవారట. ఆమెచేత కొండ కట్టెలు, కోనేటినీరు తెప్పించేవారట. ఇరుగూ పొరుగూ చూసినా, అత్తగారి నోటికి జడిసి "ఇదేమీ!" అన్న మాటన్నా అనేవారు కాదుట. భర్త ఉత్త మేధకుడు గనక, తల్లి నేమీం అనలేకపోయేవాడుట. ఆ బాధలు భరించలేక కోనలమ్మ ఒకసారి కొండదగ్గిరికి వచ్చి, ఉమ్మెత్తకాయలు తిని ఆత్మహత్య చేసుకొన్నదిట. అప్పటినుండీ ఆమె దయ్యమయిందని, చాలామంది ఆమెను చూశారని చెబుతాడు ఎల్లయ్య. ఆ తల్లి దయలేనిదే, ఆ ప్రాంతంలో ఏ పనీ

కాదంటాడతను. తనను ఈ నరలోకం బలి తీసుకొన్నది గనక తనక్కూడా నరబలి కావాలని కలలో కనిపించి చెప్పిందంటాడు ఎల్లయ్య.

"ఒకేల మనం ఇయ్యలేదనుకో. ఆ తల్లి ఊరికోదు. బలవంతాన మనకాణ్ణించి గుంజకపోతాది బాబూ!" అంటాడు ఎల్లయ్య.

తను నవ్వాడు. అంతే!

ఈ వంతెనకోసం తనెవర్ని బలి పెడతాడు? అలా బలి కావడానికి ఎవరు ముందుకు వస్తారు?

"అర్థం లేదు" అని గొణుక్కున్నాడు ముకుందం.

కనుచీకటి పడింది. తుమ్మల నెత్తిమీదుగా పెద్ద మబ్బుతునక మాసిన ఎర్రరంగుతో సోమరిగా కదిలిపోతూంది. గట్టు దిగువగా, చెట్లక్రింద వరసగా పొయ్యిలు మండుతున్నాయి. ఆ మంటల వెలుగులు కూలీల ముఖాల మీద పడి మకమక లాడుతున్నాయి.

ఎల్లయ్య గునుకు పరుగుతో గట్టుమీదికి వస్తున్నాడు.

"ఏమైంది?"

రొప్పును ఆపుకొంటూ ఎల్లయ్య చెప్పుకొచ్చాడు.

"కోటిగాడి పెళ్ళాం రొప్పుతున్నదిట. మధ్య మధ్య మూలుగుతున్నదిట. ఆడంగులేమో ఫురుటినెప్పు లంటున్నారట. కిందటి కానుపుకూడా చాలా కష్టంమీదగానీ కాలేదుట. అందుకని కోటిగాడు బేజారెత్తి పోతున్నాడట.

ఇంక ఏడుపాక్కలే తక్కువనుకోండి బాబూ ?" అన్నాడు ఎల్లయ్య.

ముకుందం గబగబా గట్టు దిగి కిందికి వచ్చాడు. అల్లంత దూరంలో ఆడవాళ్ళంతా చెట్టుకింద గుంపు కట్టారు. కోటిగాడి పెళ్ళాం పేగులు చుమ్మలు తిరిగేలాగా మూలుగుతున్నది.

ఓ కాగితంమీద గబగబా పది బంతులు రాసి ఆ కాగితాన్ని మడతబెట్టాడు ముకుందం. ఆ మడతను ఎల్లయ్య చేతి కిచ్చాడు.

"ఈ ఉత్తరాన్ని ఎవరికన్నా ఇచ్చి పేటకు పంపించు. నాకు తెలిసిన డాక్టరున్నాడు. నర్సునుకూడా తీసుకొని వెంటనే బయల్దేరి రమ్మని రాశాను... ఫర్వాలేదు ... తప్పకుండా వస్తాడు... చాలా మంచి డాక్టరు. వెళ్ళేప్పుడు సైకిల్ మీద పోతే, డాక్టరుతో బాటు కార్లో తిరిగిరావచ్చు. వెంటనే పంపుతున్నావుగా..."

ఎల్లయ్య ఆ ఉత్తరం చేతబట్టుకొని కూలీలవేపు చూశాడు.

"నేనే పొయ్యి, గబాలుమని ఆర్ని వెంటేసుకొత్తాలే అన్నా! నువ్వీడున్నావు గందా !" అన్నాడు కోటిగాడు.

కోటిగాడు సైకిల్ను తోసుకొంటూ గట్టుమీదికెక్కాడు. వంతెన స్థంభాలకు మొగదల ఉంచిన ఎర్రదీపం ఆపలించినట్లుగా ఓ సారి అటూ ఇటూ ఊగింది.

ముకుందం షెడ్ లోపలికి వచ్చాడు. తన పెట్టె తెరిచాడు. రెండు రోజులకిందట లలిత రాసిన ఉత్తరం పైనే ఉంది. అగ్గిపుల్ల గీసి, ఆ వెలుతుర్లో దాన్నొకసారి చూశాడు. తను ఇవ్వాళో, రేపో ప్రసవిస్తుందట. ఈసారి తప్పకుండా ఆడపిల్లే నంటున్నారట అందరూ. డాక్టరమ్మ గారు రెండు పూటలూ వచ్చి చూసిపోతూ ఉన్నదిట. అయినా తనకు మాత్రం లోలోపల భయం భయంగానే ఉన్నదిట. లోగడ రెండుసార్లు ప్రసవించినప్పుడు దగ్గర ఉన్నట్లుగానే ఇప్పుడూ ఉండమని, ఎలాగైనాసరే సెలవు పెట్టి రావలసిందనీ ఉత్తరాన్ని ముగించింది లలిత. అదే సమయంలో 'పోనీ, సెలవుగాని పెడదామా' అనుకొన్నాడు తను. కానీ, ఈ పని ఒక కొలిక్కి రాకముందే తను సెలవుపెట్టి ఉడాయించడం న్యాయం కాదనిపించింది. లలిత పిచ్చిగానీ, తను ఉండిమాత్రం చేసేదేముంది గనక? అన్నింటికీ భగవంతుడే ఉన్నాడనుకుని, సెలవు పెట్టే ప్రయత్నమే మానేశాడు.

మరో రెండు అగ్గిపుల్లలు గీసి, ఇంకో రెండుసార్లు లలిత సంతకాన్ని చూసి ఉత్తరాన్ని భద్రంగా మడిచి, పెట్టెలో జాగ్రత్తపరిచాడు ముకుందం. గాలి ఉదుటుకు రేకు తలుపు 'కిరకిర'మంటూంటే, దానికి గులకరాయి అడ్డుగా తోసి, షెడ్డు వెలుపలికి వచ్చాడు.

చుక్కలన్నీ క్రమంగా మసకేసిపోతున్నాయి. కొండల మీదినుండి చల్లని గాలి మదపువాసనతో సహా 'ర్రంయ్'

మని దూకుతున్నది. పొయ్యిల్లోంచి నిప్పురవ్వలు సుడులు తిరుగుతో లేచి, మిణుగురు పురుగుల్లా పొలాలమీదికి ఎగిసి పోతున్నాయి. గాలి దెబ్బలకు తాళలేక చింత చెట్లు తల లూగిస్తూ హోరెత్తి పోతున్నాయి. ఆకాశం ఆ కొసనుండి ఈ కొసకు, మెరుపుకత్తి సర్రున దూసుకుపోయింది. కొద్ది క్షణాల తరవాత మబ్బులు బాధతో మెలికలు తిరిగి బొబ్బలు పెట్టినట్లు ఉరుములు... సన్నగా, తుప్పరగా ప్రారంభమైన వాన...

కూలీలందరు గలబిలలాడిపోయారు. కోటిగాడి పెళ్ళాం గుండెలు నెర్రెలిచ్చేలాగా మూలుగుతున్నది. గాలి దెబ్బలకు చుట్టుగుడిసెలమీదున్న కంపా, కట్టా కొట్టుకుపోతున్నది. మెడ పలుపులు తెగేలాగా కంచెమేకలు గింజుకుంటున్నాయి.

ఎల్లయ్య చేతులు నులుముకొంటూ వచ్చాడు.

"అందరూ పెద్దులోకి రండి... రమ్మని చెప్పు, ఎల్లయ్యా! దానిపేరేమిటి? కోటిగాడి పెళ్ళాన్ని జాగ్రత్తగా లోపలకు తీసుకురమ్మను!"

మరో పావుగంటకల్లా కాటుక పూసినట్లుగా చీకటి అలుముకుపోయింది. చినుక్కూ, చినుక్కూ మధ్యన సందు కూడా లేకుండా మహాసముద్ర మేదో బోరగిలపడిపోయినట్లుగా భయంకరమైన వర్షం! ఉండి ఉండి మబ్బులవెనక కళ్లు జిగేలుమనే మంటలు; ఆ మహోగ్రతాపానికి తట్టుకోలేక

మేఘాలు చేసే ఆర్తనాదాల్లాంటి ఉరుములు... చీకటి, వర్షము కలిసి మెలిసి కలగలిసిపోయాయి.

గజ గజ లాడిపోతూ తలుపువారగా నుంచున్నాడు ముకుందం. ఆ మూలనుండి కోటిగాడి పెళ్ళాం మూలుగుతూ మెలికలు తిరిగిపోతున్నది. కళ్లు చికిలించుకొని, గట్టుమీదికి చూస్తున్నాడు ముకుందం! చెవులు రిక్కించి కారు చప్పుడు కోసం తెక తెక లాడిపోతున్నాడు. వర్షమూ, ఉరుములూ చేసే ధ్వనుల మధ్యనుండి లీలగానే అవుగాక, కారుచప్పుడు వినడంకోసం ముకుందం ప్రయత్నిస్తున్నాడు. కానీ వర్షపు ధ్వని, కోటిగాడి భార్య మూలుగు, వర్షపునీరు పల్లాల్లోకిదూకి చేసే చప్పుడుతప్ప, మరేదీ వినిపించడంలేదు.

ముకుందానికి లలిత జ్ఞాపకం వచ్చింది. ఆ వెంటనే ఆమె రాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. దాని ప్రకారం చూస్తే లలిత కూడా ఇవ్వాలో, రేపో ప్రసవించాలి. బహుశా ఇదేవేళకు, లలితకూడా అక్కడ... ముకుందం గిజ గిజ లాడి పోయాడు. రెండు పిడికిళ్లూ బిగించి కసికొద్దీ వర్షధారల్ని కొట్టాడు. నీరు చింది ఝుమ్మని ముఖం నిండా తుంపరలు పడ్డాయి.

తన వెనక ఎల్లయ్య గొంతు సవరించుకొంటున్నాడు.

"ఏదీ అవుపియ్యటంలేదు, బాబూ!" అన్నాడు ఎల్లయ్య మెల్లిగా.

"నాకు నేనే కనిపించటం లేదు!" అనుకొన్నాడు ముకుందం.

"దియ్యా యాడున్నదో యాదికి లేదు, బాబూ! అదేమో ఇప్పుడో; ఇంకో చనమో అంటుండది. గుడ్డు పొడుసుకున్నా ఆపట్టంలేదనుకోరి..." మెల్లిగా అన్నాడు ఎల్లయ్యా.

ముకుందం ఏమీ మాటాడలేదు. వంగి పాంటును పైదాకా మడిచాడు. బూట్లు విడిచాడు. కోటును నెత్తి మీదికి లాక్కున్నాడు. కాళ్ళు జారకుండా బురదలోకి వేళ్లు గుచ్చుతూ గట్టువేపు బయలుదేరాడు.

"యాడికండీ, బాబూ?" అన్నాడు ఎల్లయ్యా.

వర్షపు రొదలో ఆ మాట ముకుందానికి వినిపించిందో లేదో తెలీదు. నేలబారుగా వంగి, పాక్కుంటూ గట్టుమీదికి వచ్చాడు. స్తంభాలకు మొగదలన వెదురుకట్టిన ఎర్రదీపం దగ్గిరికి వచ్చాడు. వానకు తడిసిన పురికొస ముడి రాలేదు. నోటితో కొరికి, కొసను తెంపేశాడు. వత్తి హెచ్చించి మెల్లగా కిందికి జారుతూ పెద్దుదగ్గిరికి వచ్చాడు. తను చూరు కింద నిలబడి దీపాన్ని ఎల్లయ్యాకు అందించాడు.

మగవాళ్ళందరూ వాకిలివేపు ముఖాలు పెట్టి గుంపు గూడారు. ఆడవాళ్లు కోటిగాడి పెళ్ళాం చుట్టూ దడికట్టారు. కోటిగాడి పెళ్లాం గొంతుక ఆర్చుకుపోయేలాగా యింకా మూలుగుతూనే వున్నది. ఎల్లయ్యా తల్లిగావును, "ఊకో బిడ్డా" అంటూ వోదారుస్తున్నది.

ముఖంమీద పడుతున్న వాననీటిని తుడుచుకొంటూ ముకుందం గట్టుమీదుగా చూస్తున్నాడు. కారుచప్పుడు విని

పించకపోవచ్చు సరే, కనీసం లైట్లన్నా కనిపించవేం? కోటి గాడు వెళ్ళలేకపోయాడా? వెళ్ళినా డాక్టరు ఊళ్లో లేడా? ఉండికూడా రానన్నాడా! నర్సు దొరకలేదా? ఒకవేళ బయ ల్దేరారేమో! మధ్య దోవలో వున్నారేమో!

హఠాత్తుగా ఓ పెద్ద మూలుగు వినిపించింది. ఆ తర వాత 'అమ్మోవ్' అన్న కేక వినిపించింది. రెండు మూడు క్షణాల తరవాత "కేర్‌ర్‌ర్‌ర్" మన్న కొత్త ప్రాణి గొంతు వినిపించింది.

'అమ్మయ్య' అనుకున్నాడు ముకుందం.

ఆ మరుక్షణమే అతను ఉలిక్కిపడ్డాడు. గట్టుమీదుగా వర్షధారల మధ్యగా పెద్ద వెలుగుముద్ద ఒకటి ముందుకు చొచ్చుకు వస్తున్నది.

"కోటిగాడు ఇప్పు డొస్తున్నాడన్నమాట"

ఈ ఆలోచనవెంటనే ముకుందానికి ఇంకేదో జ్ఞాపకం వచ్చింది. నిలువునా చలించిపోయాడు. గట్టిగా అరుద్దా మను కొన్నాడు చెప్పరానంత భయంతో అంకిళ్ళు గిట్టకరుచుకు పోయాయి. బురదలో కూరుకుపోయిన కాళ్ళను బలవంతాన పెకలించాడు. భీతితో తూలిపోతూ గట్టుమీదికి ఎగబాకు తున్నాడు. దూరాన్నున్న వెలుగుముద్ద క్రమక్రమంగా దగ్గి రవుతున్నది. మరో రెండు బారల గట్టు తను ఎగబాకితే చాలు...

రెండు చేతులూ పైకెత్తి...

గట్టు మధ్యగా నిలబడి...

సమయం మించిపోయింది.

తన కళ్ళముందే ఆ వెలుగుముద్ద స్రరున ముందుకు దూకింది. దభీల్‌మన్న చప్పుడు వర్షపు రొదతో కలిసి పోయింది.

ముకుందం కనులు తెరిచి చూశాడు. స్టీరింగ్ రాడ్ గుండెల్లోకి గుచ్చుకుపోయిన డాక్టర్, నెత్తురుముద్దగా మారిన నర్సు, రక్తం వోడుతున్న గాయాలతో కోటిగాడు, వాడి వెనక కూలిజనం, ఓ పక్కగా సిమెంటు స్తంభానికి గుద్దుకొని, అప్పడమయిపోయిన కారు—ఆ ఎర్రదీపపు కాంతిలో భయంకరంగా మెరిసిపోవడం ముకుందం చూశాడు.

గట్టు కిందినించి కొత్త ప్రాణి గొంతుక "కేర్‌ర్‌ర్" మంటున్నది.

ఎల్లయ్య దూరంగా ఉన్న కొండలవేపు తిరిగి రెండు చేతులూ జోడించాడు.

తనేం చేశాడు? ఏం తప్పు చేశాడు ?

ఎర్రదీపం అటూ ఇటూ కదులుతూంది!

'భగవంతుడా! ఏమి టిదంతా ?' అనుకొన్నాడు ముకుందం, రెండుచేతులతోనూ ముఖాన్ని కప్పుకొని.

ఇదంతా ఏమిటో భగవంతు డతనికి చెప్పనేలేదు !